## ఆంక్షలు ఎత్తివేసి పంట రుణమాఫీ చేయాలి

**మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



గజ్వేల్, జూలై 20 : ప్రభుత్వం రైతులపై పెట్టిన ఆంక్షలు ఎత్తివేసి రూ.లక్షలోపు రుణం ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింప చేయాలని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. రాష్ట్రంలో 39లక్షల మంది రైతులకు పంట రుణమాఫీ చేయాల్సి ఉండగా 11లక్షల మందికే మాత్రమే చేయడంతో మిగతా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.31వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉండగా రూ.6వేల కోట్లు మాత్రమే చేసి చేతులు దులుపుకుందన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రూ.28వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.

## ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

**బీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యుడు పబ్బోజు విజేందర్**



కొమురవెల్లి, జూలై 20 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యుడు పబ్బోజు విజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఒకేసారి రూ.2లక్షల పంట రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ తూ తూ మంత్రంగా నిధులను విడుదల చేసిందన్నారు. రూ.లక్ష రుణమాఫీ విషయంలో గందరగోళంగా ఉందన్నారు. బ్యాంకు అధికారులు కూడా సరైన వివరాలు చెప్పడం లేదన్నారు. ఎన్నికల్లో గద్దెనెక్కేందుకు రూ.2లక్షల రుణమాఫీ ఒకే విడుతలో చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడు మూడు విడుతల్లో చేస్తామని చెప్పడం ప్రజలు గమనిస్తున్నారన్నారు.

## కొత్త నిబంధనలతో రైతులను మోసం చేసిన ప్రభుత్వం

**కోహెడ ప్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు**



కోహెడ, జూలై 20 : అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ రూ.2 లక్షల వరకు పంట రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి గందరగోళంలో పడేసిందని కోహెడ ప్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు రుణమాఫీ ప్రక్రియలో అనేక నిబంధనలు పెట్టడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. కొత్త నిబంధనలతో ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. మొదట లక్షలోపు జాబితాలో ఎంతో మంది రైతుల పేర్లు లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారన్నారు. రైతులకు రుణమాఫీ చేసే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి ఉంటే షరతులు లేకుండా వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

## మున్సిఫ్ కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలన



కోర్టు భవనంలో చేపట్టిన పనులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి

చేర్యాల, జూలై 20 : త్వరలో చేర్యాల పట్టణంలో ప్రారంభం కానున్న మున్సిఫ్ కోర్టు భవనంలో కొనసాగుతున్న పనులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి శనివారం పరిశీలించారు. బీఆర్‌ఎస్ సర్కారు పాలనలో చేర్యాలకు మున్సిఫ్ కోర్టు మంజూరు చేయడంతో పాటు కోర్టు ఏర్పాటు కోసం ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని కేటాయించారు. సదరు భవనాన్ని కోర్టుకు అనుకూలంగా ఉండేలా సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేకంగా నిర్మాణాలు, ఫర్నిచర్ తదితర వాటిని ఏర్పాటు చేసే పనులు సైతం ప్రారంభించారు. ఈ క్రమంలో కోర్టు ఏర్పాటు ప్రక్రియ కోసం జీవో రావడంతో భవనం తదితర పనులు కొనసాగుతుండగా తాజాగా కోర్టులో విధులు నిర్వహించే స్టాఫ్ కేటాయింపు వారికి వేతనాలు తదితర వాటి కోసం ఇటీవల డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్థానిక అడ్వకేట్లతో కలిసి ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రినాయుడును కలిసి సమస్యను వివరించారు. ఈ మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టు భవనంతో పాటు న్యాయవాదులు, కక్షిదారులకు కావాల్సిన వసతులు, రికార్డు గదులు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తిని చేర్యాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేర్యాలకు రావడంతో సీఐ శ్రీను, ఎస్సై దామోదర్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మొక్కల సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

- సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్
- హుస్నాబాద్‌లోని మున్సిపల్ నర్సరీ సందర్శన



హుస్నాబాద్‌లోని నర్సరీని మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్

హుస్నాబాద్, జూలై 20 : వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. శనివారం హుస్నాబాద్ పట్టణ శివారులోని కరీంనగర్ రోడ్డులో ఉన్న మున్సిపల్ నర్సరీని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సందర్శించారు. నర్సరీలో ఉన్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నాటిన మొక్కలు, నాటబోయే మొక్కల వివరాలను కమిషనర్ మల్లికార్జున్ అడిషనల్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తుండడంతో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. పట్టణంలోని ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేసి వాటిని నాటుకొని సంరక్షించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, ఏఈ సాయి ప్రణీత్, కౌన్సిలర్లు వల్లపు రాజు, చిత్తారి పద్మ, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవి కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**పలు గ్రామాల్లో పర్యటన**

హుస్నాబాద్‌రూరల్, జూలై 20 : మండల పరిధిలోని ఉమ్మాపూర్, పోతారం(ఎస్), రాములపల్లి గ్రామాల్లో శనివారం అడిషనల్ కలెక్టర్ గరీమాఅగర్వాల్ పర్యటించారు. ఈ సందర్భంగా ఉమ్మాపూర్ పరిధిలోని మహాసముద్రం గండిని పరిశీలించారు. మహాసముద్రం గండిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకొనే చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం రాములపల్లిలో మామిడి మొక్కను నాటి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఎకరానికి ఎన్ని మామిడి మొక్కలు నాటాలి... వాటి సంరక్షణ తదితర విషయాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోతారం(ఎస్) గ్రామంలో స్త్రీశక్తి స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నానోఓవెన్ బ్యాగ్స్ యూనిట్, పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్, గార్మెంట్ క్లాత్ టైలరింగ్ యూనిట్లను సందర్శించి యూనిట్ల నిర్వహణ, మార్కెటింగ్ తదితర అంశాలపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించి ఆర్థికంగా మరింతా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట డీఆర్‌డీవో జయదేవ్‌ఆర్య, అడిషనల్ డీఆర్‌డీవో మధుసూదన్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కరుణాకర్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం జీ శ్రీనివాస్‌గౌడ్, పలు శాఖల అధికారులు ఉన్నారు.

## శాకంబరీగా వాసవి కన్యకా పరమేశ్వరి



అమ్మవారిని దర్శంచుకున్న మహిళా సంఘం సభ్యులు

దుబ్బాక, జూలై 20 : దుబ్బాకలో శనివారం శాకంబరీ అవతారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి దర్శనమిచ్చారు. పట్టణంలోని వైశ్యభవన్‌లో కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శనివారం వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని శాకంబరి దేవి అవతారంలోఅలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని కూరగాయలు, ఆకు కూరలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమం లో వాసవీ మహిళా సంఘం అధ్యక్షురాలు వెనిశెట్టి పద్మ, సభ్యులు వసంత, అనురాధ, స్వరూప, కళావతి, లక్ష్మి పాల్గొన్నారు.

**కుకునూరుపల్లిలో..**

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 20 : కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని శనివారం ఆర్య వైశ్య మహిళా విభాగం, ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి కొండపాక మండల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని శాకంబరీగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు నవీన్‌కుమార్, ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ పాండురంగం, ఆర్య వైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు స్రవంతి, మహాసభ నాయకులు, ఆర్యవైశ్య మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగుభానుమూర్తి జయంతి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న అర్చకులు, ఉద్యోగులు

వర్గల్, జూలై 21 : ప్రసిద్ధ పుణ్య క్షేత్రం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆలయాల అర్చక, ఉద్యోగుల సంక్షేమ సారథి గంగుభానుమూర్తి జయంతి వేడుకలను ఆలయ అర్చకులు, ఉద్యోగులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగు ల, అర్చకుల వేతనాల పెంపు కోసం చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో నాచగిరిక్షేత్రం అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మన ఆరోగ్యం మన చేతుల్లోనే..



పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, జూలై 20 : మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకన్న అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్, మాంటెస్సోరి పాఠశాలలో శనివారం సఫాయి అప్నా బీమారి భగావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కోఆప్షన్ సభ్యుడు అయిలేని శంకర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, హరితహారం సూపర్‌వైజర్ జాలిగాం శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, వార్డు అధికారి సాంబరాజు తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఆషాఢ బోనాలు



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మున్నూరు కాపు సంఘం సభ్యులు

మిరుదొడ్డి, జూలై 20 : ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మహంకాళి దేవి అమ్మవారికి మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సామూహికంగా బోనాలను తీశారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల్లో బోనాలను డప్పు చప్పుళ్లతో బైండ్ల పోత రాజుల విన్యాసాల మధ్య వైభవంగా ఊరేగించారు. అనంతరం నైవేద్యాన్ని అమ్మ వారికి సమర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## 14 మంది పంచాయతీ కార్యదరుల బదిలీ

అక్కన్నపేట, జూలై 20 : మండల పరిధిలో 14 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. శనివారం ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. మండలంలోని చౌటపల్లికి సంజీవ్, మోత్కులపల్లికి రవీందర్, పెద్దతండాకు రజిని, పంతుల్‌తండాకు శ్రీకాంత్, దుబ్బతండాకు కవిత, ధర్మారం కార్తీక్, మల్‌చెర్వుతండాకు అనూష, కపూర్‌నాయక్‌తండాకు తిరుమల, కట్కూరుకు చిరంజీవి, గొల్లపల్లికి స్వాతి, గుబ్బడికి అపర్ణ, నందారంకి తిరుపతి, మంచినీళ్లబండకు గౌతమ్ బదిలీపై వచ్చారు. కట్కూరు గ్రామ పంచాయతీ సీనియర్ కార్యదర్శి మోహన్ సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లికి బదిలీపై వెళ్లారు. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉండగా, 14 పంచాయతీ కార్యదర్శులు బదిలీ జరిగింది.

## నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వర్గల్, జూలై 20 : వర్గల్ జవహర్ నవోదయ కేంద్రీయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం సెప్టెంబర్ 16లోపు మొబైల్ ఫోన్ ద్వారా (లేదా) ఇంటర్‌నెట్ సెంటర్( లేదా) ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తులు స్వీకరిస్తామని విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ ఆమోదిత పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. నవోదయ అర్హత పరీక్ష 2025 జనవరి 18న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు WWW.Navodaya.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. నవోదయ ప్రవేశ సీట్ల ఎంపికల్లో ఎలాంటి ప్రలోభాలకు తావులేదని, ఎవరిని నమ్మి మోసపోవద్దని ప్రిన్సిపాల్ సూచించారు.

## సస్యరక్షణ చర్యలతో కత్తెర పురుగు నివారణ



బుస్సాపూర్‌లో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

సిద్దిపేట రూరల్, జూలై 20 : సస్యరక్షణ చర్యలతో కత్తెర, చిత్త పురుగు నివారణ సాధ్యమని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు జక్కు విజయ్, సీహెచ్ పల్లవి అన్నారు. శనివారం జిల్లాలోని సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్ మండలాల్లో పలు పంటలను పరిశీలించినట్లు తెలిపారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు, పెసర, కంది, మినుము పంటల్లో చిత్త పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి గమనిస్తే లింగాకర్షక బుట్టలు నాలుగు చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

## విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కోహెడ, జూలై 20 : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, సీసీ కెమెరాలు, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు, షీటీమ్ బృందం, సదయ్య, మహిళా హెడ్ కానిస్టేబుల్ స్వప్న, కానిస్టేబుళ్లు ప్రశాంతి, సుష్మ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 20 : గ్రామాల్లోని అన్ని ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మద్దూరు ఏఎస్సై జగదీశ్వర్ అన్నారు. శనివారం మద్దూరు మండలంలోని రేబర్తి, గాగిళ్లాపూర్, ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామాలలోని దుర్గమ్మ, పెద్దమ్మ ఆలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన పలువురిని ఏఎస్సై శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చోరీల నియంత్రణకు ఆలయాల వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కల్లు గీత కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

హుస్నాబాద్, జూలై 20: కల్లుగీత కార్మిక సంఘం హుస్నాబాద్ మండల, పట్టణ నూతన కమిటీలను శనివారం హుస్నాబాద్ పట్టణంలోని రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మామిడి తిరుపతిగౌడ్, ఉపాధ్యక్షులుగా బండారి కిష్టయ్యగౌడ్, గాదగోని కొమురయ్యగౌడ్, సహాయ కార్యదర్శులుగా బొమ్మగాని ఎల్లయ్యగౌడ్, కోడూరు మల్లేశంగౌడ్, కోశాధికారిగా సదానందం ఎన్నికయ్యారు. అలాగే హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడిగా పూదరి రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా కోయడ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ శ్రీనివాస్, కోశాధికారిగా చంద్రమౌళిగౌడ్, సహాయ కార్యదర్శులుగా రవీందర్‌గౌడ్, మహేశ్‌గౌడ్ ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోయడ కొమురయ్య, ఎల్లమ్మ గుడి అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, పరిశయ్య, రామస్వామి, సమ్మయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బరోడా బ్యాంకు ఆవిర్భావ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు

వర్గల్, జూలై 20 : మండల కేంద్రంలోని బరోడా బ్యాంక్ బ్రాంచ్ కార్యాలయంలో శనివారం ఆ శాఖ కార్యాలయ సిబ్బంది, ఖాతాదారులు బ్యాంక్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ మౌనిక, క్యాషియర్ రాకేశ్, ఖాతాదారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయుడు వేణుగోపాల్

చేర్యాల, జూలై 20 : మండల పరిధిలోని కొత్త దొమ్మాట ప్రాథమికోన్నత పాఠశాలలో గత 12 ఏండ్లుగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయుడు వంగర వేణుగోపాల్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం విద్యార్థులకు నోటు పుస్తకాలు, జావా తాగేందుకు స్టీలు గ్లాసులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు చింతల మమత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పోచమ్మ, యాదగిరి, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలి



అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం ప్రజ్ఞాదేవి

చేర్యాల, జూలై 20 : రెండున్నరేండ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని యాదవనగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రజ్ఞాదేవి కోరారు. యాదవనగర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం అంగన్‌వాడీ టీచర్ జి.స్వరూపరాణి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా యాదవనగర్ పరిధిలోని కర్షకనగర్, ఉట్లపల్లి కాలనీలకు చెందిన చిన్నారుల తల్లిదండ్రులకు అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, అంగన్‌వాడీ వర్కర్ పాల్గొన్నారు.

**ఐదో వార్డులో..**

సిద్దిపేట టౌన్, జూలై 20 : అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం ఐదో వార్డు కౌన్సిలర్ అన్నగోని వినోద్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో రమాదేవి, ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి వార్డులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు జ్యోతి, హేమలత, స్వప్న, చంద్రకళ, ఏఎన్‌ఎం షాహిన్ సుల్తానా, ఆశ వర్కర్ లక్ష్మిలు పాల్గొన్నారు.

**జగదేవ్‌పూర్‌లో..**

జగదేవ్‌పూర్, జూలై 20 : మూడేండ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సీడీపీవో సరిత అన్నారు. శనివారం జగదేవ్‌పూర్‌లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ప్లే స్కూల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రజిత, భవాని టీచర్లు పాల్గొన్నారు.

## సకాలంలో జీతాలు చెల్లించాలని ఉపాధ్యాయుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మాడల్ స్కూల్ ఉపాధ్యాయులు

బెజ్జంకి, జూలై 20 : సకాలంలో జీతాలు చెల్లించాలని మండల పరిధిలోని మాడల్ స్కూల్ ఉపాధ్యాయులు శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హర్జీత్‌కౌర్, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వం సకాలంలో జీతాలు చెల్లించడం లేదని, వెంటనే చెల్లించాలన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**సీపీ అనురాధ**



సిద్దిపేట కలెక్టరేట్, జూలై 20 : సైబర్ నేరాలపై జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ తెలిపారు. శనివారం కమిషనర్ కార్యాలయంలో సీపీ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా ఖాతాల్లో డేటా గోప్యంగా ఉంచాలన్నారు. ఉపయోగంలో లేని సమయంలో కంప్యూటర్లు, మొబైల్‌ను లాక్ చేయాలన్నారు. పొడవైనప పాస్‌వర్డ్‌ను ఉపయోగించాలని, వాటిని తరచూ మారుస్తూ ఉండాలన్నారు. అపరిచితులు పంపిన లింకులపై క్లిక్ చేయరాదన్నారు. క్రెడిట్, డెబిట్ కార్డు సమాచారం ఇవ్వరాదని సూచించారు.

## సకాలంలో బిల్లులు మంజూరు చేయాలి

సిద్దిపేట కమాన్, జూలై 20 : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) సిద్దిపేట జిల్లా కమిటీ నాయకులు శనివారం సిద్దిపేట జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్‌ను కలిశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లాలో ఉపాధ్యాయుల మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులను సకాలంలో జీవో నెంబర్ 74 ప్యాకేజీ ప్రకారం విడుదలయ్యేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ వలిహ్మద్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, పూర్వాధ్యక్షుడు చంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు యాదగిరి, కోశాధికారి కృష్ణ, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ కనకరాజు, కమిటీ సభ్యులు వెంకటేశం, రామచంద్రం, సాబీర్, రాజేందర్, యాదయ్య , శ్రీనివాస్, రాజలింగం, భిక్షపతి, శ్రీనివాస్, నర్సింలు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు అధ్యక్షుడిగా ఎల్లయ్య

కోహెడ, జూలై 20 : సముద్రాల గ్రామ జాతీయ మాల మహానాడు గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గ్రామంలో జరిగిన సమావేశంలో జరిగిన ఎన్నికలో ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా కిశోర్, సంయుక్త కార్యదర్శిగా శ్రావణ్, కోశాధికారిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శరత్, సోషల్ మీడియా కార్యదర్శిగా అజయ్, సలహాదారులుగా రవి, లక్ష్మయ్య, వెంకటయ్య, కనుకరాజు, మల్లయ్యలు ఎన్నికయ్యారని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నె రాజు తెలిపారు.

## స్వచ్ఛంద సంస్థలు రైతులకు అండగా నిలవాలి



రైతు సేవా ఫౌండేషన్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్, జూలై 20 : స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవా సంఘాలు రైతులకు ఎల్లవేళలా అండగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. శనివారం హన్మకొండలోని తన నివాసంలో రైతు సేవా ఫౌండేషన్ వారి కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల సాగులో రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు నూతన వ్యవసాయ పద్ధతులపై సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం ప్రతినిధులు రామారావు, శ్రీధర్, రాంచందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు రావడం లేదని నీటి సరఫరా బంద్

సిద్దిపేట, జూలై 20 : మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న ఆపరేటర్లు లైన్ మన్ నీటి సరఫరాను ఆపివేయడంతో పట్టణంలో పలు వార్డుల్లో శనివారం నీటి సరఫరా బంద్ అయింది. దీంతో నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వెంటనే నీటి సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌ను అడుగగా వేతనాలకు సంబంధించి ఇంకా అప్రూవల్ రాలేదని చెప్పారు. వచ్చిన తర్వాతనే వేతనాలు చెప్పడంతో శుక్రవారం నుంచి పట్టణానికి మంగోల్ నుంచి సరఫరా అయ్యే నీటిని ఆపివేశారు. మల్లన్న సాగర్ నుంచి నీటి సరఫరా ఆగిపోవడంతో శనివారం పట్టణంలో 20 వార్డులకు నీటి సరఫరా ఆగిపోయింది.

**అనుమతి రాగానే వేతనాలు ఇస్తాం**

మిషన్ భగీరథ నీటి సరఫరా పథకం ఇంకా పూర్తిస్థాయిలో మున్సిపల్ ఆధీనంలోకి రాలేదు. మిషన్ భగీరథ పథకంలో నీటి సరఫరా కాంట్రాక్టర్ వద్ద పని చేసిన 8 మందికి మున్సిపల్‌లో తీసుకోవడానికి కలెక్టర్‌కు లెటర్ పెట్టాం. సీడీఎమ్‌ఏకు వీరి విషయమై అప్రూవల్ కోసం లెటర్ పెట్టాం. రాగానే వారికి వేత నాలు ఇస్తాం. పట్టణంలో నీటి సరఫరా ఆగిపోయిన విషయం నా దృష్టికి రాలేదు. నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం.

**- ప్రసన్నారాణి, మున్సిపల్ కమిషనర్**

## బీమా డబ్బులు అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న చైర్మన్ తన్నీరు శరత్‌రావు

బెజ్జంకి, జూలై 20: మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంకులో ఖాతాదారుగా ఉన్న రేగుపల్లికి చెందిన వాడే సుమలత ఇటీవల మరణించగా పీఎంజేజేబీవై పథకం ద్వారా మంజూరైన రూ.2 లక్షల నగదును ఆమె కుటుంబ సభ్యులకు ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘ చైర్మన్ తన్నీరు శరత్‌రావు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఖాతాదారుడికి బీమా సౌకర్యం ఉందని తెలిపారు. అలాగే సంఘంలోని 186 మంది రైతులకు రుణమాఫీ జరిగిందని వివరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బండి రమేశ్, డైరెక్టర్లు నరేశ్‌బాబు, తిరుపతిరెడ్డి, మేనేజర్ ప్రవీణ్, సూపర్‌వైజర్ దుర్గం, సీఈవో శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముంపు గ్రామాలకు నూతన పిన్‌కోడ్

గజ్వేల్, జూలై 20: గజ్వేల్ పట్టణ సమీపంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ఎర్రవల్లి, పల్లె పహాడ్, ఏటిగడ్డకిష్టాపూర్, పోస్టు ఆఫీస్ కార్యాలయ సేవలను కుకునూర్‌పల్లి మండల కేంద్రం ఎస్‌వో కార్యాలయం నుంచి డీ లింక్ చేసి గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ఎస్‌వో కార్యాలయానికి అటాచ్ చేస్తూ శనివారం అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ఆయా గ్రామాలకు నూతనంగా 502311 పిన్‌కోడ్‌ను కేటాయించారు. కాలనీ నిర్మాణం జరిగినప్పటి నుంచి పాత పిన్‌కోడ్ నంబర్‌తోనే ఆయా గ్రామాలకు ఉత్తరాలు రాగా ఇక నుంచి కొత్త పిన్‌కోడ్ నంబర్‌తో ఉత్తరాలు రానున్నాయి.

## హెల్పింగ్ కుక్కర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

జగదేవ్‌పూర్, జూలై 20 : మండల కేంద్రంలోని ఆదర్శ బాలికల వసతి గృహంలో సహాయ వంట మనుషుల పోస్టులకు శనివారం ఎంపీడీవో యాదగిరి, ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో ఉమామహేశ్వరి, సీఆర్పీ దయానంద్ పాల్గొన్నారు.

## పబ్లిక్ సర్వెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

సిద్దిపేట, జూలై 20 : సిద్దిపేట జిల్లా పబ్లిక్ సర్వెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి సందిరెడ్డి యాదిరెడ్డి తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా అంజయ్య, ప్రధాన కార్యదర్శిగావిక్రం రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా కల్లేపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పోచయ్య, కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శిగా బాలకిషన్, శ్రీనివాస్ రాజు, ఆర్థిక సంఘం సభ్యులుగా రాంరెడ్డి, లింగ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా సత్యనారాయణ, రాజేందర్, భూమయ్య, రామచంద్రారెడ్డి, శ్రీనివాసులును ఎన్నుకున్నారు.

## విద్యార్థులు నైతిక విలువలు కలిగి ఉండాలి

గజ్వేల్, జూలై 20: విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు కలిగి ఉండాలని, లక్ష్య సాధన దిశగా విద్యార్థులు ముందడుగు వేయాలని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ అన్నారు. శనివారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంపాక్ట్ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరీమోద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై చర్చించాలి

సిద్దిపేట, జూలై 20 : విద్యా రంగ సమస్యలపై విద్యార్థి సంఘాలతో సీఎం చర్చించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ అన్నారు. శనివారం వారు సిద్దిపేట మాట్లాడుతూ.. విద్యావిధానంపై మేధావులతో చర్చించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ- ప్రైమరీ తరగతులను నిర్వహించాలనే ప్రతి పాదన ప్రభుత్వ విద్యారంగానికి నష్టమన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.